సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం, 30, మే, 2023



...రెండుసార్లు జాబ్‌మేళా
నిరుద్యోగ యువత కోసం ఏడాదికి రెండు సార్లు జాబ్‌మేళా నిర్వహిస్తామని మాజీ ఎంపీ పొంగులేటి తెలిపారు. 8లో



వణికిస్తున్న జ్వరాలు
అశ్వారావుపేట మండలం వడ్డెర రంగాపురం గ్రామంలో వారం రోజులుగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
39° / 27°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఎండ తీవ్రత ఉంటుంది. ఒకటి, రెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: రామాలయంలో శ్రీసీతారామ చంద్రస్వామివారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణం జరిపారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం
శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఖమ్మం నగరం ఖానాపురానికి చెందిన ఉపాధ్యాయురాలు ఉమా సుందరి రూ.1,01,116 విరాళం అందించారు. దాతకు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా రశీదును అందచేశారు.

బొగ్గు ఉత్పత్తి పరిశీలన



జీకే ఓసీని పరిశీలిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకే ఓసీని సోమవారం సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి సందర్శించారు. వ్యూపాయింట్ నుంచి ఓసీలో ఓబీ, బొగ్గు ఉత్పత్తి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ క్వారీలోని హై వాల్స్‌ను బలోపేతం చేయాలని సూచించారు. మోటారు పంపులు నడుస్తున్న క్రమంలో నీటిలో సున్నం కలపాలని, దీనివల్ల నీటి పీహెచ్ తగ్గి, మోటారు పంపులకు నష్టం వాటిల్లకుండా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం జక్కం రమేష్, అధికారులు శ్రీరమేష్, ఎస్‌ఆర్ మురళి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయిలక్ష్మికి ఎన్టీఆర్ విశిష్ట కళాపురస్కారం



పురస్కారం అందుకుంటున్న సాయిలక్ష్మి

బూర్గంపాడు: భద్రాచలానికి చెందిన నాట్యగురువు తాటిగడప సాయిలక్ష్మికి ఎన్టీఆర్ విశిష్ట కళాపురస్కారం దక్కింది. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఆర్కే కళాసంస్కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెకు అవార్డును అందించారు. 2 వేల మందికి నాట్యం నేర్పించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ప్రదర్శనలు ఇప్పించినందుకు గాను కళారంగంలో ఆమెకు పురస్కారం ప్రదానం చేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్‌రావు, సినీ నటుడు ప్రసన్నకుమార్ చేతుల మీదుగా సాయిలక్ష్మి అవార్డు అందుకున్నారు. లయన్ డాక్టర్ సీహెచ్ రాజశేఖర్‌రెడ్డి, ఆర్కే ఫౌండేషన్ డైరెక్టర్ రంజిత్ తదితరులు ఆమెను అభినందించారు.

సీఆర్టీలకు తీపికబురు

ఇక నుంచి 12 నెలలకు వేతనం

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్(సీఆర్‌టీ)లకు ప్రభుత్వం సోమవారం తీపి కబురు అందించింది. వేసవి సెలవులతో కలిపి ఈ విద్యా సంవత్సరంలో 12 నెలల పాటు వేతనం అందిస్తున్నట్లు ఆ శాఖ కమిషనర్ క్రిస్టినా జెడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న సుమారు 200 మందికి లబ్ధి చేకూరనుంది. గతంలో వీరికి పదిన్నర నెలలకు మాత్రమే గౌరవ వేతనం అందించేవారు. కొద్ది నెలలుగా 12 నెలలకు వేతనం చెల్లించాలని పోరాటం చేస్తున్న సీఆర్‌టీలు ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని తెలంగాణ మైనారిటీ బాలుర కళాశాలలో కామర్స్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్ లాల్ హట్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంకామ్ కామర్స్, బీఈడీ విద్యార్హతలతో పాటు ఆంగ్లమాధ్యమంలో నాలుగేళ్ల బోధనానుభవం కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల మంగళవారం నుంచి వచ్చే నెల 3వ తేదీ లోపు కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆదాయానికి గండి!



వారపు సంత (ఫైల్)

- గత మార్చితో ముగిసిన సంత, డైలీ మార్కెట్ వేలం గడువు
- రెండు నెలలు గడిచినా మళ్లీ టెండర్లు పిలవని వైనం
- చేష్టలుడిగి చూస్తున్న కొత్తగూడెం మున్సిపల్ అధికారులు
- మరోవైపు అనధికారికంగా వ్యాపారుల నుంచి వసూళ్లు

కొత్తగూడెంఅర్బన్: అధికారుల నిర్లక్ష్యంతో జిల్లాలో ఏ గ్రేడ్‌గా ఉన్న కొత్తగూడెం మున్సిపాలిటీ ఆదాయానికి గండిపడుతోంది. పురపాలిక పరిధిలోని వారపు సంత, డైలీ మార్కెట్‌కు సంబంధించి గతేడాది టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పటివరకు సంబంధిత నగదు చెల్లించలేదు. అయినా ఆ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధి కావడంతోనే చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది మార్చితో వారపు సంత, డైలీ మార్కెట్, కబేళా టెండర్‌గడువు ముగిసింది. దీంతో మున్సిపల్ అధికారులు మళ్లీ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చి వేలంపాట నిర్వహించాల్సి ఉంది. కానీ రెండు నెలలు గడుస్తున్నా అధికారుల్లో చలనం లేదు. కొందరు మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో తెరవెనుక ఒప్పందాలు కుదరలేదని, అందుకే టెండర్లు జాప్యం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. గత ఏడాది కూడా వారపు సంత, డైలీ మార్కెట్‌లను అధికార పార్టీ ప్రజాప్రతినిధి(కాంట్రాక్టర్) రూ.50 లక్షలకు వేలంపాటలో దక్కించుకుని, అందులో సగం మొత్తాన్ని మున్సిపాలిటీకి చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈసారైనా అటువంటి పరిస్థితులు తలెత్తకుండా, పాలకవర్గ సభ్యుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా పారదర్శకంగా టెండర్ నోటిఫికేషన్ ఇచ్చి వేలంపాట నిర్వహించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మున్సిపాలిటీ రూ. కోటి ఆదాయం కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా ఏప్రిల్‌లోనే నోటిఫికేషన్ ఇస్తామని నిర్ణయించిన మున్సిపల్ అధికారులు ఇంతవరకు అడుగు ముందుకు వేయలేదు.

IPE - 2023
STATE TOPPER
Sr.MPC
994
1000
P.RAJESH, H.T.No. 2343201794
కృష్ణవేణి కాలేజి
IIT & Medical Academy
కొత్తగూడెం - 92469 45057 - మణుగూరు - 94418 16116
పాల్వంచ - 92469 24743 - ఇల్లందు - 86861 47048
సత్తుపల్లి - 97056 22299
త్రివేణి కొత్తగూడెం • ఖమ్మం • హైదరాబాద్

వ్యాపారుల ఆవేదన..

గత ఏడాది డైలీ మార్కెట్, వారపు సంతను దక్కించుకున్న కాంట్రాక్టర్లు మున్సిపాలిటీ నుంచి అనుమతి రాకముందే వ్యాపారుల నుంచి వసూళ్లు చేశారు. కొత్త ధరలు నిర్ణయించి ఇబ్బందులు పెడుతున్నారంటూ వ్యాపారులే ఆందోళనలు చేసిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి కొనసాగుతున్నట్లు సమాచారం. గత ఆదివారం రైతుబజార్‌లోని ప్రైవేటు మార్కెట్‌లో కొందరు మాజీల పేర్లు చెప్పి వ్యాపారుల నుంచి వసూళ్లు చేసినట్లు తెలిసింది. టెండర్, వేలంపాటలు నిర్వహించకుండానే, మున్సిపల్ కార్యాలయం నుంచి కాకుండా ప్రైవేటు వ్యక్తులు డబ్బులు వసూళ్లు చేయడంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అనధికారిక వసూళ్లపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని తమను కాపాడాలని వ్యాపారులు వేడుకుంటున్నారు.

సదుపాయాలు కరువు

సంత నుంచి మున్సిపాలిటీకి ప్రతి సంవత్సరం ఆదాయం వస్తున్నా.. సంత, డైలీ మార్కెట్, కబేళాలో వ్యాపారులకు సదుపాయాలు కల్పించడం లేదు. అమ్మకాలు జరిగే ప్రదేశాల్లో కనీస సదుపాయాలు కూడా లేవు. తాగునీటి సదుపాయం, టాయిలెట్స్ లేక మహిళా వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా కూడా పట్టించుకోవడం లేదని వ్యాపారులు వాపోతున్నారు.

కౌన్సిల్ ఆమోదించాక..



మున్సిపల్ కౌన్సిల్‌లో ఆమోదించిన తర్వాత వారపు సంత, డైలీ మార్కెట్, కబేళాకు నోటిఫికేషన్ ఇస్తాం. అనంతరం వేలంపాట నిర్వహిస్తాం. డైలీ మార్కెట్‌లో అనధికారికంగా వసూళ్లు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఎవరు వసూళ్లు చేసినా చర్యలు తీసుకుంటాం.

–జి.రఘు, మున్సిపల్ కమిషనర్

పండుగలా దశాబ్ది ఉత్సవాలు..



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, వేదికపై విప్ రేగా, కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యేలు వనమా, హరిప్రియ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల

- రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరపాలి
- తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కళ్లముందు కదలాడాలి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ఐడీఓసీలో సోమవారం కలెక్టర్ అనుదీప్ అధ్యక్షతన నిర్వహించిన ఉత్సవాల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భవించక ముందు ఉన్న పరిస్థితిని, గత తొమ్మిది సంవత్సరాలుగా రాష్ట్రం సాధిస్తున్న అభివృద్ధి, సంక్షేమం కళ్లముందు కదలాడేలా, గ్రామగ్రామానా వేడుకలు జరపాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాధించిన ప్రగతి ఉట్టిపడేలా ఉత్సవాలు ఉండాలని చెప్పారు. జూన్ 2వ తేదీ నుంచి నిర్వహించే ఉత్సవాల్లో ప్రజలు అధికసంఖ్యలో భాగస్వామ్యం అయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. భద్రాద్రి నూతనంగా ఏర్పడిన జిల్లా అయినప్పటికీ సమష్టి కృషితో జాతీయ అవార్డులను సాధించడం హర్షణీయమని పేర్కొన్నారు. పోడు పట్టాల విషయంలో కూడా అధిక ప్రాధాన్యం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకే ఉందన్నారు. మండువేసవిలో కూడా తాగునీరు లేదని ప్రజాప్రతినిధుల కాన్వాయ్‌లు ఆపి నీళ్ల లేవనే పరిస్థితులు, ఖాళీ బిందెలు పట్టుకుని నీళ్ల కోసం వెళ్తున్న దృశ్యాలు ఇప్పుడు మారుమూల ప్రాంతాల్లో కూడా కనిపించడం లేదన్నారు. ప్రతీ ఇంటికి మంచినీరు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో, ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ప్రస్ఫుటంగా కనిపిస్తోందని, ఇదే విషయాన్ని దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలకు తెలపాలని కోరారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాబోయే తరాలకు స్ఫూర్తిగా ఉత్సవాలను నిర్వహించాలన్నారు. ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల ప్రాధాన్యతను ప్రజాప్రతినిధులకు కూడా స్పష్టంగా అర్థమయ్యేలా సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ తేదీల వారీగా నిర్వహించనున్న కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, జెడ్పీవైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, డీసీసీబీ, గ్రంథాలయ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

IIT... JEE... NEET...లలో
గుణిత్మమైన సరికొత్త ఫలితాలకోసం
తెలివైన విద్యార్థుల ఎంపిక
రెజొనెన్స్
డే & రెసిడెన్షియల్ బాలికల కోసం ప్రత్యేక క్యాంపస్
అడ్మిషన్లు జరుగుచున్నవి
Resonance
JEE, MEDICAL ACADEMY & JUNIOR COLLEGES
Wyra Road, KHAMMAM.
8886662267, 8886662276

సమస్యలు పరిష్కరించాలి

ప్రజావాణిలో డీఆర్‌ఓ అశోకచక్రవర్తి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి అశోకచక్రవర్తి సూచించారు. సోమవారం ఐడీఓసీలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీఓ స్వర్ణలత, కలెక్టరేట్ ఏఓ గన్యాతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి ఉన్న అవకాశాలను లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు.

ప్రజావాణిలో వచ్చిన కొన్ని ఫిర్యాదులు..

- దుమ్ముగూడెం మండలం నారాయణరావుపేట పంచాయతీ గంగారం గ్రామానికి చెందిన 38 ఆదివాసీ కుటుంబాలు పోడుపట్టాలు ఇప్పించాలని దరఖాస్తు చేయగా తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- తన ఇల్లు అగ్నిప్రమాదంలో కాలిపోయిందని, డబుల్ బెడ్ రూం ఇల్లు ఇప్పించాలని కోరుతూ అశ్వారావుపేట మండలం పాత పేరాయిగూడేనికి ఎస్.ముత్యాలు అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా, తగిన చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- రుద్రంపూర్‌లో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపాన్ని దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ముస్తాబు చేయాలని రుద్రంపూర్ జేఏసీ నాయకులు గూడెల్లి యాకయ్య, క్రాంతి తదితరులు దరఖాస్తు చేశారు.

వీసీకి హాజరైన కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ అనుదీప్ హాజరై జిల్లాలో చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఐడీఓసీ సమావేశపు హాలులో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వచ్చే నెల 2న ఉదయం 9 గంటలకు ప్రగతి మైదానంలో అమరవీరుల స్తూపానికి నివాళులర్పించే కార్యక్రమం ఉంటుందని, అనంతరం ఐడీఓసీ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ ఉంటుందని వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీపీఆర్వో, డీఈఓలను ఆదేశించారు. అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు, సింగరేణి, కేటీపీఎస్, బీపీఎల్ పరిశ్రమల అధికారులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు



గిరిజనుల సమస్యలు వింటున్న పీఓ గౌతమ్

భద్రాచలం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని సంబంధిత యూనిట్ అధికారులకు అందజేసి అర్హతల మేరకు పరిష్కరించాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ మేరకు ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని అన్నారు. ఐటీడీఏ తరఫున గిరిజనులకు అందజేసిన సంక్షేమ పథకాలు, వారి అభివృద్ధి గురించి వివరించాలన్నారు. అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని, వారు జీవనోపాధి పొందేలా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏఓ భీమ్, జీసీసీ డీఎం విజయ్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజీ, ఎస్‌ఓ సురేష్‌బాబు, ఏపీఓ మునీర్ పాషా, డీఎస్‌ఓ ప్రభాకర్ రావు, ఏసీఎంఓ రమణయ్య, మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం హరికృష్ణ పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలలో ఉచిత ప్రవేశాలు..



కస్తాల సత్యనారాయణ

కొత్తగూడెంరూరల్: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి కనీసం 7 జీపీఏ సాధించిన పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యా పథకం కింద ఇంటర్మీడియట్ ప్రవేశాలు కల్పించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు ఉమ్మడి జిల్లాలో ఐదు కళాశాలల్లో 268 సీట్లు ఉన్నాయని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండలం కృష్ణవేణి జూనియర్ కళాశాలలో 161, ఖమ్మం జిల్లాలోని శ్రీ చైతన్య ఆర్ట్స్ అండ్ సైన్స్ , సీవీ రామన్, రెజొనెన్స్, కృష్ణవేణి కో ఆపరేటివ్ జూనియర్ కళాశాలలో 107 సీట్లు కేటాయించినట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2 లక్షలు, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.లక్ష మించరాదని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో కుల, ఆదాయ ధ్రువపత్రాలు, పదో తరగతి మెమో, నాలుగు నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, వసతి గృహాల్లో చదివిన వారైతే 8, 9, 10 తరగతుల హాస్టల్ ధ్రువీకరణ పత్రం, 2 పాస్‌పోర్టు ఫొటోలు, బ్యాంకు పాస్‌బుక్, రేషన్‌కార్డు నకళ్లు జతపర్చాలని కోరారు. దివ్యాంగులైతే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని తెలిపారు. www..telangana.epass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి



పర్ణశాల పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

దుమ్ముగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు సకాలంలో, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ బృందం సభ్యులు సూచించారు. సోమవారం వారు పర్ణశాల పీహెచ్‌సీ పరిధిలోని చిన్ననల్లబల్లి సబ్ సెంటర్‌ను సందర్శించారు. బృందం సభ్యులు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ అనంత పద్మనాభ భట్, డాక్టర్ షాహిద్ అలీ తదితరులు ఆస్పత్రిలో వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించారు. సబ్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీ పనితీరుపై ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే బాధితులకు ఆరోగ్య పరీక్షలు, అవగాహన పెంపొందించడం వంటి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పర్ణశాల పీహెచ్‌సీని సందర్శించి, పలు సూచనలు చేశారు. తొలుత పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష, ఇతర అధికారులు బాలాజీనాయక్, రేపాక చైతన్య, రేణుకారెడ్డి పాల్గొన్నారు.

వైద్యం.. మిథ్య!



సింగరేణి ప్రధానాస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు(ఫైల్)

సింగరేణిలో రిటైర్డ్ కార్మికుల గోస

- సీపీఆర్‌ఎంఎస్ కార్డుల ద్వారా అందని వైద్యం
- బిల్లులు చెల్లించలేదంటున్న కార్పొరేట్ ఆస్పత్రులు
- అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బంది పడుతున్న వృద్ధులు

సింగరేణి(కొత్తగూడెం): ఉద్యోగ విమరణ పొందిన సింగరేణి కార్మికులకు వైద్యం అందడం లేదు. యాజమాన్యం బిల్లులు చెల్లించకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులు చికిత్స నిర్వహించడంలేదు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో కార్మికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు వైద్యం అందించేందుకు యాజమాన్యం సీపీఆర్‌ఎంఎస్(కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికేర్ స్కీమ్) కార్డులు జారీ చేసింది. రూ.40 వేలు చెల్లిస్తే రిటైర్డ్ కార్మికుడికి, అతని భార్యకు రూ.8 (4+4) లక్షల విలువైన వైద్యం అందించేలా నిబంధనలు విధించింది. దీంతో సంస్థ వ్యాప్తంగా 11 ఏరియాల్లో 27,633 మంది రూ.40 వేల చొప్పున చెల్లించి కార్డులు పొందారు. వీరిలో జిల్లాలో కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియాలతోపాటు కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయానికి సంబంధించిన వారు 9,895 మంది ఉన్నారు. వీరంతా సంస్థ నిబంధనల మేరకు ప్రతియేటా కార్డు రెన్యూవల్‌కు లైవ్ సర్టిఫికెట్ కూడా సమర్పిస్తున్నారు.

వెల్ఫేర్ అధికారుల నిర్లక్ష్యంతో..

లబ్ధిదారులు అందించిన వివరాల జాబితాను పొందుపరిచి సంబంధిత ఏరియా, ఆ తర్వాత ప్రధాన కార్యాలయంలోని వెల్ఫేర్ విభాగం అధికారులు అప్రూవల్ చేయాల్సి ఉంటుంది. కానీ వెల్ఫేర్ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సీపీఆర్‌ఎంఎస్ కార్డులు అప్రూవల్ చేయడం లేదు. రిటైర్డ్ కార్మికులు తమకు కార్డు ఉన్నదనే భరోసాతో వైద్యం కోసం యాజమాన్యం గుర్తించిన ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. తీరా అక్కడకు వెళ్లాక ఆస్పత్రి నిర్వాహకులు 'మీ కార్డు అప్రూవల్ కాలేదు. ఉచిత వైద్యం అందించలేం'అని చెబుతున్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటు, పక్షవాతం, షుగర్, బీపీ, కిడ్నీ సమస్యలతో వెళ్లినవారు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అప్పుడు ఉన్నతాధికారుల చుట్టూ తిరిగితే తప్పా వైద్యం అందడం లేదని కార్డుదారులు వాపోతున్నారు.

జిల్లాలోని సీపీఆర్‌ఎంఎస్ కార్డుదారుల వివరాలు	
ఏరియా	సంఖ్య
కొత్తగూడెం	2,300
కార్పొరేట్	4,435
మణుగూరు	1,945
ఇల్లెందు	1,215

నిధులేమవుతున్నాయి..?

కార్మికుల ఆరోగ్యం కోసం ఏటా సంస్థ నిధులు ఇస్తోంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ.145.32 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 132 కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందవచ్చని ప్రకటించింది. కానీ బిల్లులు చెల్లించలేదంటూ ఆస్పత్రుల యాజమాన్యాలు చికిత్స అందించడం లేదు. ఈ నేపథ్యంలో సంస్థ ఏటా కేటాయించే నిధులు ఏమవుతున్నాయనే ప్రశ్న తలెత్తుతోంది. సింగరేణి సీపీఆర్‌ఎంఎస్ కార్డుతో చేరేవారికి కార్పొరేట్ ఆస్పత్రులు నాణ్యమైన సేవలందించడం లేదని కార్మికులు వాపోతున్నారు. గుండెపోటు వంటి అత్యవసర బాధితులకు కూడా సరైన చికిత్స చేయకపోవడంతోపాటు అవసరం ఉన్నా, లేకపోయినా ఐసీయూలో ఉంచుతున్నారని పేర్కొంటున్నారు. ఒకసారి ఆస్పత్రికి వెళ్తే రూ. 4 లక్షల బడ్జెట్ కాజేస్తున్నారని, దీంతో మళ్లీ వైద్యం పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మిక సంఘాలు కూడా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

ఇప్పుడా పరిస్థితి లేదు



సీపీఆర్‌ఎంఎస్ కార్డుల ద్వారా వైద్యం అందని పరిస్థితి గతంలో ఉండేది. కానీ ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. ఎప్పటికప్పుడు అప్రూవ్ చేస్తున్నాం. ఏమైనా సమస్యలు ఎదురైతే సింగరేణి ప్రధాన కార్యాలయంలోని సంబంధిత వెల్ఫేర్ విభాగంలో సంప్రదిస్తే సత్వరమే పరిష్కరిస్తాం.

–ఎస్.బలరాం, డైరెక్టర్ (పా)

క్లుప్తంగా

వీఓఏల అరెస్ట్



ములకలపల్లి పోలీస్ స్టేషన్‌లో వీఓఏలు

ములకలపల్లి: ఉద్యోగ భద్రత కల్పించాలని, శ్రమకు తగిన వేతనం చెల్లించాలని నెలరోజులుగా వీఓఏలు సమ్మె చేస్తున్న నేపథ్యంలో సోమవారం మండలానికి చెందిన పలువురిని పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు దాసం కనకలక్ష్మితోపాటు పలువురిని ఇళ్ల వద్ద అదుపులోకి తీసుకోగా, మరికొందరిని సమ్మె శిబిరానికి వెళ్తున్న క్రమంలో అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాగా, అక్రమ అరెస్ట్‌లను ప్రజలంతా ఖండించాలని, అరెస్ట్ చేసినవారిని బేషరతుగా విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకులు సరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు.

వీఓఏల ముందస్తు అరెస్ట్

అశ్వారావుపేటరూరల్: స్థానిక వీఓఏలను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమం నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఐదుగురు వీఓఏలను అరెస్ట్ చేసి, అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్‌ఐ రాజేశ్‌కుమార్ తెలిపారు.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం



సాధించిన పతకంతో దుర్గేశ్వరరావు

మణుగూరు రూరల్ : తెలంగాణ మాస్టర్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి మాస్టర్ వెయిట్ లిఫ్టింగ్ మెన్, ఉమెన్ చాంపియన్ షిప్‌లో మణుగూరుకు చెందిన గొర్రె దుర్గేశ్వరరావు బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 15 రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది పోటీలో పాల్గొనగా, దుర్గేశ్వరరావు 73 కేజీల విభాగంలో బంగారు పతకం గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కొక్కెరపాటి పుల్లయ్య

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కమిటీ నేతృత్వంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య కోరారు. సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూన్ 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను అశ్వారావుపేటలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శి విజ్జుకృష్ణన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాగర్, పోతినేని సుదర్శన్ తరగతులకు హాజరవుతారని తెలిపారు. కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చి బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసి కార్పొరేట్ సంస్థలకు అప్పగించేలా కుట్ర చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో తగరం జగన్నాథం, సంతాపురి చెన్నారావు పాల్గొన్నారు.

ఇక ఏడాదికి రెండుసార్లు జాబ్‌మేళా

- నిరుద్యోగుల మోముల్లో చిరునవ్వే లక్ష్యం
- ఉమ్మడి ఖమ్మం జిల్లా యువతకు హామీ ఇస్తున్నా
- మెగా జాబ్‌మేళా ప్రారంభోత్సవంలో మాజీ ఎంపీ పొంగులేటి
- 10 వేల ఉద్యోగాలకు 21 వేల మంది పేర్లు నమోదు





ఉద్యోగానికి ఎంపికైన యువతికి అపాయింట్‌మెంట్ లెటర్ అందిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీల ప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్ : నిరుద్యోగ యువత కోసం ఇకపై తన ఆధ్వర్యంలో సంవత్సరానికి రెండు సార్లు జాబ్‌మేళా నిర్వహిస్తానని, ఇది ఉమ్మడి జిల్లా యువతకు తాను ఇస్తున్న హామీ అని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో పొంగులేటి ఆధ్వర్యంలో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత మోముల్లో చిరునవ్వు చూడాలన్నదే తన లక్ష్యమని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతీ నిరుద్యోగికి ఉద్యోగం ఇప్పించే బాధ్యత తనదేనని అన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో తీవ్రమైన సమస్యలు పేరుకుపోయాయని, అన్ని వర్గాల వారిని సీఎం కేసీఆర్ తన మాటలతో మాయ చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేస్తున్నారని అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్‌తో కాకుండా సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగుల ఆశలు, ఆశయాలను నెరవేర్చేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని భరోసా ఇచ్చారు. జాబ్‌మేళాలో దివ్యాంగులకు, ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. చిన్న ఉద్యోగం, తక్కువ వేతనం అని చూడకుండా ఉద్యోగాల్లో చేరి ఉన్నత స్థానాలకు ఎదగాలని యువతకు పిలుపునిచ్చారు. తన బృందం మీ వద్దకు వచ్చినప్పుడు వారిని ఆశీర్వదించాలని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో తన మనుషులను దీవించాలని ఈ సందర్భంగా కోరారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన..

పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా నుంచి నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. మొత్తంగా 21వేల మంది పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 100 కంపెనీలతో ఇంటర్వ్యూలు నిర్వహించాలని నిర్ణయించగా.. మొత్తం 120 కంపెనీలు 10 వేల పోస్టుల ఖాళీలతో పాల్గొన్నాయని నిర్వాహకులు వెల్లడించారు. 18 వేల మంది ఇంటర్వ్యూల్లో పాల్గొనగా, 10 వేల ఖాళీలకు అభ్యర్థులను కంపెనీలు ఎంపిక చేశాయని, స్పాట్‌లో 4, 218 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందించారని చెప్పారు. మిగిలిన వారికి రెండు రోజుల్లో అందించనున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నాలుగు హెల్ప్ డెస్క్‌లతో పాటు రెండు పెద్ద హాళ్లలో ఇంటర్వ్యూలకు కౌంటర్లు ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కల్పించారు. చంటి పిల్లలతో తల్లులు జాబ్ మేళాకు హాజరు కాగా, వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఊకంటి గోపాలరావు, జారె ఆదినారాయణ, డాక్టర్ కోటా రాంబాబు, విజయబాయి, వైరా మున్సిపల్ చైర్మన్ సూతగాని జైపాల్, కార్పొరేటర్లు దొడ్డా నగేష్, మలీదు జగన్, మియాభాయ్, నారపోగు వెంకట్, రైట్ ఛాయిస్ మెండెం కిరణ్ కుమార్, కొత్త కోటేశ్వరరావు, జాబ్ మేళా కన్సల్టెన్సీల నిర్వాహకుడు మన్ మోహన్ పాల్గొన్నారు.

నాకు మొదటి ఇంటర్వ్యూ..



ఇంజనీరింగ్ పూర్తి చేశా. ఇదే నాకు మొదటి ఇంటర్వ్యూ. ఇంత పెద్ద జాబ్ మేళాలో పాల్గొనడం సంతోషంగా ఉంది. మూడు కంపెనీల ఇంటర్వ్యూల్లో పాల్గొన్నా. వారు ఇచ్చే ఆఫర్‌లో నచ్చిన కంపెనీలో చేరాలనుకుంటున్నా. – సిమ్రాన్, ఖమ్మం

సంతోషంగా ఉంది..



ఖమ్మం కేంద్రంగా మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. స్థానికంగా జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అవకాశం కల్పించిన నిర్వాహకులకు ధన్యవాదాలు. రెండు కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరయ్యా. నచ్చిన కంపెనీలో చేరుతా. – రుత్విక, ఖమ్మం

మంచి స్పందన వచ్చింది..



మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు మంచి స్పందన వచ్చింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి వేలాది సంఖ్యలో నిరుద్యోగ యువత పేర్లు నమోదు చేసుకున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశాం. పది వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే మా లక్ష్యం.

– తుంబూరు దయాకర్‌రెడ్డి, పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి

దరఖాస్తుల ఆహ్వానం

బూర్గంపాడు: తెలంగాణ గురుకుల సొసైటీ పరిధిలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యాబోధన కోసం గెస్ట్ ఫ్యాకల్టీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బూర్గంపాడు, వైరా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు రాజ్యలక్ష్మి, రమా తెలిపారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పరిధిలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అన్ని సబ్జెక్టులలో విద్యాబోధనకు అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జూన్ 3వ తేదీ సాయంత్రం వరకు అభ్యర్థులు తమకు సమీపంలో ఉన్న గురుకుల పాఠశాలల్లో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. బోధన అనుభవం, అకడమిక్ రికార్డు ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు.

Dr. Ramesh
ఐ & మల్టీస్పెషాలిటీ హాస్పిటల్
Cell : 99515 94022
కావలెను
- M.B.B.S./Duty Doctors - 3
- Diploma Optometrist - 2
- ANM / GNM - 10
- ICU Staff - 6
- PRO - 5
- ECG/X-Ray Technician - 3
- BSC MLT / DMLT - 3
- Accountant - 3
- Computer Operator - 3
- Pharmacists - 3
- Receptionists - 4
- Aayas - 5

03-6-2023 శనివారం
04-06-2023 ఆదివారం

హైకోర్టును ఆశ్రయించిన మహిళా అభ్యర్థులు

వెల్ఫేర్ ఆఫీసర్ అభ్యర్థుల విన్నపాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశాలు



పరీక్ష సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో వెల్ఫేర్ ఆఫీసర్ (ఇంటర్నల్) పోస్టులకు నిర్వహించిన పరీక్షలో మెరిట్ సాధించిన మహిళా అభ్యర్థులు ఈ నెల 25న హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని సింగరేణి సంస్థకు ఆదేశాలిస్తూ తదుపరి విచారణనకు జూన్ 6కు వాయిదా వేసినట్లు సమాచారం. సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 11 వెల్ఫేర్ ఆఫీసర్ ట్రెయినీ గ్రేడ్–1 (ఇంటర్నల్) పోస్టులకు ఈ నెల 21న యాజమాన్యం పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షకు సంబంధించి 672 మంది దరఖాస్తు చేసుకోగా 602 మంది హాజరయ్యారు. వారిలో కొందరు మహిళలు మెరిట్ కూడా సాధించారు. మెరిట్ అభ్యర్థులకు సంస్థ మహిళా రిజర్వేషన్ ప్రకారం పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. సింగరేణి సంస్థ కోలిండియా నిబంధనల ప్రకారం నడుస్తుందని, ఈ నేపథ్యంలో వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులను మహిళలకు కేటాయించాలనే నిబంధనలు లేనందున వారికి పోస్టింగ్ ఇవ్వడం లేదని సంస్థ తెలిపింది. ఈ క్రమంలో మెరిట్ సాధించిన నలుగురు మహిళా అభ్యర్థులు బీఎంఎస్ నేతృత్వంలో హైకోర్టును ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు తదుపరి విచారణను ఈ నెల 6కు వాయిదా వేసినట్లు తెలిసింది.

లోపభూయిష్ట విధానాలతో ఇబ్బంది..



సింగరేణి సంస్థ రిక్రూట్‌మెంట్ విభాగం లోపభూయిష్టంగా మారింది. ఎక్స్‌టర్నల్ అభ్యర్థుల విషయంలో ఒక నిబంధన, ఇంటర్నల్ అభ్యర్థుల విషయంలో మరో నిబంధన అమలు చేస్తోంది. పురుషులకు ఒక విధానం, మహిళలకు మరో విధానం ఉండటంతో మహిళా అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నో అంశాల్లో చాలా మంది కోర్టును ఆశ్రయిస్తున్నారు. చివరికి అభ్యర్థులే గెలుస్తున్నారు. అయినా సంస్థ విధానాల్లో మార్పు లేకుండా పోతోంది. ఇప్పటికైనా సంస్థ విధానాలు మార్చాల్సిన అవసరం ఉంది.

పి.మాధవ్‌నాయక్, బీఎంఎస్ జాతీయ కార్యదర్శి

4.85 క్వింటాళ్ల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

భద్రాచలంఅర్బన్ : ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి కరీంనగర్‌కు తరలిస్తున్న 4.85 క్వింటాళ్ల గంజాయిని భద్రాచలం పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.కోటి ఉంటుందని చెప్పారు. పట్టణంలోని సీఆర్పీఎఫ్ క్యాంప్ వద్ద ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఒడిశాకు చెందిన రఘునాథ్, రబింద్ర గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. ట్రాక్టర్ ట్రాలీకి రహస్యంగా చాంబర్ ఏర్పాటు చేసి ఒక్కోటి ఐదు కిలోల చొప్పున 97 ప్యాకెట్లను అందులో అమర్చారు. గతంలో ఇదేవిధంగా పలుమార్లు విజయవాడ, గుంటూరు, కరీంనగర్‌లో గంజాయి విక్రయించినట్లు విచారణలో వెల్లడించారని పోలీసులు తెలిపారు. భద్రాచలం టౌన్ సీఐ నాగరాజురెడ్డి కేసు నమోదుచేసి, నిందితులను రిమాండ్‌కు తరలించారు.

NEW RIDGE SCHOOL
Nursery to X Class (EM)
Opp. NSP Guest House, Khanapuram Haveli, KHAMMAM.
Cell: 7729969764, 7729969763, 7075430452.
WANTED
Qualified, efficient and experienced candidates are required for the following posts.
- Pre-Primary : UKG Mother Teacher
- Primary (I to V) : Mathematics, English & Social
- High School (VI to X) : Hindi, Mathematics
- Non-Teaching : P.E.T.
Attend the interview with original certificates from 30.05.2023 onwards. Timings : 9:00 to 4:00 P.M.
Correspondent

వణికిస్తున్న జ్వరాలు

- వడ్డెర రంగాపురంలో విజృంభణ
- భయాందోళనలో ఏజెన్సీ ప్రజలు




ఇంట్లోనే చికిత్స పొందుతున్న చిన్నారులు

అశ్వారావుపేటరూరల్: ఇంకా వర్షాకాలం సీజన్ రాకముందే ఏజెన్సీలోని పలు పల్లెల్లో జ్వరాలు రోజురోజుకూ విజృంభిస్తున్నాయి. అయినా వైద్య ఆరోగ్య శాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జ్వర పీడితుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ వైద్య శాఖకు సమాచారం ఉండటం లేదంటే ఆ శాఖ పనితీరు క్షేత్రస్థాయిలో ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మండలంలోని గుమ్మడవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వడ్డెరరంగాపురం గ్రామంలో వారం రోజులుగా జ్వరాలు వ్యాపిస్తున్నాయి. ఈ ఒక్క గ్రామంలోనే దాదాపు ఇరవై మంది వరకు జ్వరాలతో బాధ పడుతున్నారు. పదుల సంఖ్యలో జ్వరాలతో బాధపడుతూ మంచం పట్టారు. అయినా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన మడివి సత్యం, మడివి శ్రీను, తమ్మిశెట్టి నాగులు, డేరంగుల చిట్టెమ్మ, మడివి లక్ష్మి, గుంజి రాణి, కె.సుశీల, గండికోట వెంకటరత్నం, తమ్మిశెట్టి లక్ష్మయ్య, పల్లపు సూర్యచంద్రారావు, వల్లెపు పావని, వెంకటేశ్ జ్వరాలతో బాధపడుతున్నారు. వారితోపాటు మరికొంత మంది జ్వరాలతో సతమతమవుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. జ్వర పీడితులంతా గ్రామీణ వైద్యులను ఆశ్రయించి చికిత్స పొందుతున్నారు. వారిలో అధికంగా మలేరియా, టైఫాయిడ్ బాధితులే ఉన్నట్లు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కొద్ది రోజుల కిందటే అశ్వారావుపేట మండలంలోని కుడుములపాడు గ్రామంలో విషజ్వరాలు విజృంభించగా, రెండు రోజుల కిందట మారుమూల అటవీ ప్రాంతంలోని మొద్దులమాడలో పది మందికి పైగానే జ్వర పీడుతులున్నారు. ఆయా గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ శిబిరాలను ఏర్పాటు చేసి చికిత్స అందించారు. జ్వరాలతో బాధ పడుతున్న వడ్డెరరంగాపురంలో తక్షణమే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై గుమ్మడవల్లి పీహెచ్‌సీ వైద్యురాలు మధులికను 'సాక్షి'వివరణ కోరగా.. వడ్డెరరంగాపురం గ్రామంలో జ్వర పీడితులు అధికంగా ఉన్నట్లు గుర్తించామని, అక్కడ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. జ్వరాలు అధికంగా వచ్చే చోట తక్షణమే శిబిరాలు ఏర్పాటు చేసేలా సూపర్‌వైజర్లను ఆదేశించినట్లు చెప్పారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: పురుగులమందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండంలోని పాండురంగాపురంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పాండురంగాపురానికి చెందిన పోతురాజు శివప్రసాద్ (26) సోమవారం చేను వద్దకు వెళ్లి పురుగులమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న శివప్రసాదన్‌ను చుట్టుపక్కల వాళ్లు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి అతడిని ఆటోలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. యువకుడు పురుగులమందు తాగడానికి గల కారణం తెలియరాలేదు.





★ మేలురకం విత్తనాలు వాడండి... అధిక దిగుబడిని సాధించండి...
★ ఆరుతడి పంటలను పండించండి.
★ అంతర పంటల సాగును ప్రోత్సహించండి.
★ ఏడాదికి ఒకసారి మట్టి పరీక్షలు చేయించండి.
ది. భద్రాచలం
ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ సీడ్స్ డీలర్
వెల్ఫేర్ అసోసియేషన్
భద్రాచలం.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781976]

Wanted
■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786366]
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K. Ph : 9848571888 [H-793432]
■ హైదరాబాద్‌లో 5స్టార్ హోటల్స్‌లో క్యాటరింగ్ బాయ్స్&గర్ల్స్, హెల్పర్స్, సె॥గార్డ్స్, సూ॥ వైజర్స్ కావలెను, రూం+భోజనం ఫ్రీ, జీతం: 15,000 to 30000/-ఫోన్: 7981515640, 9989930582 [H-781307]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182, 9010299957
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలి : కూనంనేని



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సుజాతనగర్: ప్రజా సంపదను దోచిపెడుతూ.. మతం, కులం పేరుతో ప్రాంతాలు, ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీకి 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. జూన్ 4న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగే ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ సుజాతనగర్ మండలవ్యాప్తంగా సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజలకు రక్షణ కరువై ప్రమాదంలో పడ్డారని, దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మహిళా రెజ్లర్లు రోడ్డెక్కి ఆవేదన వ్యక్తం చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందని, దేశ ప్రజల కోసం కాకుండా రేపిస్టులు, లక్షల కోట్లు ఎగనామం పెట్టే వారికి మోదీ సర్కార్ బాసటగా నిలుస్తోందని విమర్శించారు. దేశాన్ని విచ్ఛిన్నకర శక్తుల నుంచి కాపాడుకోవాలంటే దేశవ్యాప్తంగా ఉన్న పార్టీలు, ప్రజలు ఏకం కావాలని కోరారు. కార్యక్రమంలో సాబీర్‌పాషా, భూక్య దస్రు, కొమారి హనుమంతరావు, జక్కుల రాములు, తాళ్లూరి పాపారావు, వేల్పుల భాస్కర్, శంకర్, రాములు, ముక్కెర మురళి, బాగం కృష్ణ, ఎర్రం రాజు, పాదిల శ్రీనివాస్, లక్ష్మ, బండి రమేశ్, జానకీరామ్, కొమారి కృష్ణ, శ్రీకాంత్, హత్తిరామ్ తదితరులు పాల్గొన్నారు.

లారీకింద పడి బీటెక్ విద్యార్థి మృతి

నుజ్జునుజ్జయిన శరీరం.. కుటుంబంలో విషాదం



జీవన్‌రెడ్డి (ఫైల్)

పాల్వంచ: లారీకింద పడి యువకుడు దుర్మరణం చెందిన ఘటన పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన బీటీపీఎస్ ఉద్యోగి అనుమల్ల శ్రీను కుమారుడు జీవన్‌రెడ్డి (22) సోమవారం మోటార్ సైకిల్‌పై రాహుల్‌గాంధీనగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో బీసీఎంరోడ్‌లోని ఆశ్రమ పాఠశాల సమీపంలోకి రాగానే మున్సిపల్ చెత్త బండికి తగిలి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో పాల్వంచ నుంచి కొత్తగూడెం వెళ్తున్న లారీ జీవన్‌రెడ్డి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి శరీర భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు భారీగా అక్కడికి చేరుకోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నరేశ్ ఘటనా స్థలానికి చేరుకుని చెల్లాచెదురుగా పడిపోయిన శరీర భాగాలను చేతితో పట్టుకుని ఆటోలో ఎక్కించడం గమనార్హం. జీవన్‌రెడ్డి బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నరేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు మావోయిస్టుల అరెస్ట్



పోలీసులు అరెస్ట్ చేసిన మావోయిస్టులు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంట పోలీసులు ముగ్గురు మావోయిస్టులను సోమవారం అరెస్ట్ చేశారు. కుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని సున్నంగుడ, మురళిగుడ అటవీ ప్రాంతంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా ముగ్గురు మావోయిస్టులు తారసపడటంతో వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడు మృతి



సోమరాజు మనోహర్ (ఫైల్)

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సోమరాజు మనోహర్ హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు స్వయాన అల్లుడు. భౌతికకాయన్ని మంగళవారం రేగళ్ల గ్రామం తీసుకొస్తారని బుధవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఎందరో పేదలకు సహాయం చేశారు. పేద విద్యార్థులకు స్కూల్ ఫీజులు కట్టే వారని పలువురు తెలిపారు. మనోహర్ మృతికి పలువురు గ్రామస్తులు నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.